


పింఛన్ సొమ్ముతో వాలంటీరు పరార్

- పట్టుకుని సొమ్ము రికవరీ చేసిన పోలీసులు

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండలంలోని కుమ్మడి సింగి పంచాయతీ చింతల గొంది గ్రామ వాలంటరీ కొండపల్లి కొండబాబు పింఛను సొమ్ముతో పరారయ్యాడు. ఈనెల ఒకటో తేదీన లబ్ధిదారులకు అందించవలసిన పింఛన్ డబ్బులను ఇవ్వకుండా ఆ సొమ్ముతో పరారయ్యాడని అంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు చెల్లించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై స్థానిక ఎంపిడిఒ జై సాగర్‌ను ఫోనులో వివరణ కోరగా, పింఛనుదారులకు చెల్లించాల్సిన డబ్బులతో వాలంటీరు పరారైన విషయం తన దృష్టికి వచ్చిందని, దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసుల సొమ్మును కూడా రికవరీ చేసి తమకు అందజేశారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాలంటీరుపై చర్యలు తీసుకుంటామన్నారు.

మన్యంలో వరి వర్షార్పణం

- ఏకధాటి వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తం
- పొంగిన వాగులు, గెడ్డలు..నిలిచిన రాకపోకలు
- పంటలూ, జనావాసాలకు తీవ్రనష్టం
- అనంతగిరిలో మూగజీవాలు మృత్యువాత
- లువ్వగెడ్డలో ముగ్గురు గిరిజనుల గల్లంతు



సీలేరులో భారీ వర్షాలకు పాడైన చోడి పంట

ప్రజాశక్తి-పాడేరు/ పాడేరు టౌన్: మిచౌంగ్ తుపాను అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుతోపాటు మన్యంపై తీవ్ర ప్రభావం చూపింది. మన్యాన్ని బుధవారం కూడా వర్షం వీడలేదు. కురుస్తున్న వర్షాలకు రోడ్లు, వీధులు, గ్రామాలు చిత్తడిగా మారాయి. పాడేరు మండలంలోని బుంగగెడ్డ, చిలకల మామిడి గెడ్డ, మత్స్య గెడ్డలు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, అనంతగిరి, అరకు మండలాల్లోని గెడ్డలు, వాగులు ఉదతంగా ప్రవహిస్తున్నాయి. కోతకు సిద్ధమైన వరి ఒరిగిపోయింది. పనల దశలో ఉన్నది తడిసింది. కల్లాల్లో రాశులు పోసి బరకాలు కప్పిన ధాన్యం కిందకు వర్షపు నీరు చేరిపోయింది. వానలు తగ్గక, నీరు కదలక రైతులు పంటలను కాపాడుకోవడానికి యాతన పడుతున్నారు. ఇప్పటికే కోసిన వరి పనలు పొలాల్లో ఉండడంతో తడిసిపోయాయి. రైతులు వరికుప్పలకు బరకాలు కట్టిన చుట్టూ నీరు చేరి నానిపోయాయి. కొన్నిచోట్ల పొలాల్లో వరి పనలు తడవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సంవత్సరం అంతా కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుపాను కారణంగా నష్టం ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉండడంతో జనజీవనం స్తంభించింది.రోడ్లు నిర్మానుష్యమయ్యాయి దుకాణాలు, హొటళ్లు, పాఠశాలలు తెరుచుకోలేదు. వాగులు పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రహదారులు జలమయమయ్యాయి. ఏజెన్సీలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వలస కూలీలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తుపాను వల్ల సోమవారం ప్రారంభమైన వాన ఏకధాటిగా కురుస్తూనే ఉంది.

ఏజెన్సీ పొడుగునా విస్తారంగా వర్షాలు

పాడేరు : జిల్లా వ్యాప్తంగా బుధవారం సగటున 163.28 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా వాతావరణ శాఖ ప్రకటించింది. జిల్లాలో అత్యధికంగా అనంతగిరిలో 305.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా ముంచింగిపుట్టు మండలంలో 64.8, దేవీపట్నంలో 217.4, ఏటపాక 205.2, కూనవరం 201, మారేడుమిల్లి 198.4, రాజవొమ్మంగి 188.4, రంపచోడవరం 185, అడ్డతీగల 177.6, గంగవరం 174.4, కొయ్యూరు 170, డుంబ్రిగుడ 162, వై.రామవరం 159, జికె వీధి 152.6, చింతూరు 151.6, హుకుంపేట 147.8, జి.మాడుగుల 135.8, పాడేరు 134, చింతపల్లి 130.6, అరకువ్యాలీ 121, వరరామచంద్రపురం 114.6, పెదబయలు 95.8 జిల్లా మొత్తం 3592.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అనంతగిరి : మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కుండ పోత వర్షాలతో వరి, చోడి, సామలు, రాజ్మా, కందులు, ఇతర పంటలు పలు దినుసుల పూర్తిగా దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు ప్రభుత్వం తక్షణమే తమ నష్టాన్ని గుర్తించి, సాయం అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

రాజవొమ్మంగి : మిచౌంగ్ తుఫాను ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఒట్టిగెడ్డ, గింజర్తి, మడేరు, నెల్లిమెట్ల కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో గింజర్తి, నెల్లిమెట్ల, రాజవొమ్మంగి, వయ్యేడు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. డి.మల్లవరం గ్రామ శివారులో రహదారిపై ఉన్న కల్వర్టు కొట్టుకుపోవడంతో గ్రామానికి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని తంటికొండ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రంగా లేకపోవడంతో ఇల్లోల్లోకి వరదనీరు చేరడంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చాలాచోట్ల వరిచేలు నీట మునిగాయి, పలుచోట్ల ఈదురుగాలులకు పలుచోట్ల విద్యుత్ వైర్లపై చెట్టుకొమ్మలు విరిగిపడడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక తహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచారి, డిటి ఏ.సత్యనారాయణ, ఎస్ఐ ఎస్.వెంకయ్య తదితరులు గ్రామాలను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

చింతూరు : రెండు రోజుల నుండి చింతూరు డివిజన్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వీఆర్ పురం, కూనవరం, ఎటపాక, చింతూరు మండలాల్లో రైతులకు తీవ్ర పంట నష్టం కలిగింది. సుమారు 60 వేల హెక్టార్లలో వరి, మొక్కజొన్న, సోయాబీన్, నువ్వులు, పత్తి పంట, పొగాకు వంటి వాణిజ్య పంటలు కూడా నీట మునిగాయి. కోతకు వచ్చిన వరి నీట మునగటంతో రైతులకు గుండె కోత మిగిల్చింది. కుండపోతగా కురుస్తున్న వర్షం కారణంగా భారీ చెట్టు జాతీయ రహదారి-30పై ఏడుగురాళ్లపల్లి సమీపంలోని కాటుకపల్లి వద్ద పడడంతో భద్రాచలం నుండి రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా రాష్ట్రాలకు సుమారు నాలుగు గంటల పాటు రవాణా సౌకర్యం స్తంభించింది. అధికారులు జెసిబి సహాయంతో రోడ్డుపై ఉన్న చెట్లను తొలగించడంతో తిరిగి రవాణా సౌకర్యం పున:ప్రారంభమైంది. వర్షానికి మండల కేంద్రంలో రోడ్లపై నీరు కాలువలా ప్రవహిస్తోంది. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురికి నీరుతో పాటు వర్షపు నీరు నివాసాల్లో ప్రవేసిస్తుంది.

అడ్డతీగల : భారీ వర్షాలకు అడ్డతీగల, రంపచోడవరం ప్రధాన జాతీయ రహదారిలోని గంగవరం గ్రామ శివారు ప్రాంతంలో కల్వర్ కొట్టుకుపోవడంతో గోకవరం నుండి అడ్డతీగల రంపచోడవరం నుండి పాడేరు వెళ్ళవలసిన ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మండలంలోని చేనుపాకలు, బొడ్లంక, కోనలోవ, ఎల్లవరం గ్రామాలలో వరి పంట నీట మునిగింది. వర్షాలకు వాగులు వంకలు పొంగి, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల విద్యుత్ వైర్లపై చెట్టుకొమ్మలు విరిగిపడడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక తహశీల్దారు తాతారావు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాలను సందర్శించారు. ఎస్ఐ అప్పలరాజు తమ సిబ్బంది పొంగి ప్రవహిస్తున్న మడేరు వాగు పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు జాగ్రత్తలు తెలియజేశారు.

మారేడుమిల్లి : భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రజలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మారేడుమిల్లి-బోదులూరు వెళ్లే ప్రధాన రహదారి కొత్త కాలనీ సమీపంలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎంపీడీవో వీర కిషోర్, ఎమ్మార్వో శ్రీనివాస్ స్పందించి వృక్షాన్ని తొలగించి రాకపోకలకు సుగమనం చేశారు.

కొయ్యూరు : మండలంలోని చింతలపూడి, గింజర్తి గ్రామాల మధ్యలో ఉన్న రహదారిపై బుధవారం భారీ చింత చెట్టు కూలింది. దీంతో పలూ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజారావు తమ సిబ్బందితో వెళ్లి జేసీబీ సహాయంతో చెట్టును తొలగించి, వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. పెదమాకరం రాజేంద్రపాలెం వద్ద కొండవాగులు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మిచౌంగ్ తుఫాన్ కారణంగా వరి, మినుప, పెసర, ప్రతి, టమాట రాజ్‌మా పంట చేలు దెబ్బతిన్నాయి. వరిచేలు తడిసి ముద్దయయ్యాయి. జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్, కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు పొలాల్లోకి వెళ్లి పర్యవేక్షించారు. రైతులకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సీలేరు : జికేవీధి మండలం దారకొండ, గుమ్మిరేవులు, దుప్పిలివాడ పంచాయతీల్లో వరి, చోడి, రాజ్మా, మినప, సామలు తదితర పంటలు మిచౌంగ్ తుఫాన్ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారికి నష్ట పరిహారం చెల్లించి రైతులు ఆదుకోవాలని దారకొండ సర్పంచ్ ఎస్. రాజు, గుమ్మరేవులు మాజీ సర్పంచ్ బాబురావు, దుప్పులివాడ సర్పంచ్ కె. కుమారి డిమాండ్ చేశారు.

భూపతిపాలెం జలాశయం నుండి నీరు విడుదల

రంపచోడవరం : మండలంలోని భూపతిపాలెం రిజర్వాయర్ వరద నీటితో నిండు కుండలా మారింది. మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు బుధవారం ఉదయం భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ఇరిగేషన్ అధికారులు ఆరు గేట్లను ఎత్తి సుమారు 5000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. జలాశయం నుండి దిగువకు వస్తున్న వరద నీరు తెల్లటి పాల నూరుగులా కనిపిస్తుండటంతో దానిని చూసేందుకు పలువురు పర్యాటకులు బారులు తీరారు.



హుకుంపేట మండలంలో నీటిలో తేలియాడుతున్న కోసిన వరి పనలు

ఘాట్‌రోడ్డులో విరిగిపడ్డ కొండచరియలు : రాకపోకలకు అవస్థలు



ఘాట్‌రోడ్డులో విరిగిపడిన కొండ చరియలు

అనంతగిరి : మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో మన్యంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగళవారం కేకేలైన్ రైల్వేట్రాక్‌పై కొండచరియలు విరిగిపడగా, బుధవారం అనంతగిరి, అరకు ఘాట్ రోడ్డు పలుచోట్ల కొండ చరియలు విరిగిపడ్డాయి. అనంతగిరి, ఎగువశోభ పంచాయతీ పరిధి కాఫీ ప్లాంటేషన్ అరకు మెయిన్ రోడ్డు లో భారీ ఎత్తున మట్టి రాళ్లు చేరిపోవడంతో రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అలాగే అరకు మెయిన్‌రోడ్డు నుండి బారజోల గ్రామానికి వెళ్లే రహదారిలో మట్టి రాళ్ల రప్పలు చేరాయి. అనంతగిరి, టోకూరు పంచాయతీ బోడగూడ సమీపం అరకు మెయిన్ రోడ్డు వద్ద, అలాగే పర్యాటక ప్రాంతమైన బొర్రా వెళ్లే రహదారిలో రైల్వే గేటు సమీపంలో రోడ్లపై కొండ చరియలు విరిగిపడ్డాయి.

పశువుల పాక కూలి

మూడు దుక్కిటెద్దులు మృత్యువాత

అనంతగిరి : తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. మండలంలోని కొండిభ పంచాయతీ టైడా గ్రామంలో జన్ని అప్పన్నకు చెందిన పశువుల పాక కూలిపోవడంతో మూడు దుక్కిటెద్దులు శిథిలాల కింద చిక్కుకుని మృత్యువాత పడ్డాయి.అలాగే పైనంపాడు పంచాయతీ బల్లిమామిడి గ్రామానికి చెందిన కొర్రా దున్నుకు చెందిన ఒక గొర్రె కూడా మృతి చెందింది. మండలంలోని పలు పంచాయతీల్లో తుపాన్, వర్షాల దెబ్బకు పలు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి.



పశువుల పాక పడడంతో మృతి చెందిన దుక్కిటెద్దులు

పలు ఇళ్లు నేలమట్టం

అనంతగిరి : తుఫాన్ ప్రభావంతో వీస్తున్న గాలులు, కుండపోత వర్షాలకు మండలంలోని గుమ్మ పంచాయతీ వంజెలవసస బిడ్డ, పాడిరాజు అలాగే టోకూరు పంచాయతీ బోడగుడ గ్రామానికి చెందిన ములియగుడ కిల్లో సుజాత గుమ్మ కోట గ్రామానికి చెందిన పలువురు గిరిజనుల ఇళ్లు కూలిపోయాయి.

డుంబ్రిగుడ :మండలంలో మిచౌంగ్ తుపాను ప్రభావంతో భారీ కుండపోత వర్షంతో కొర్ర గ్రామానికి చెందిన మోహనరావు పెంకుటిల్లు కూలిపోయింది. అరుకు సంతబయలు, పోతంగి, తూటంగి గ్రామాల్లో గిరిజనుల ఇల్లులు నేలకొరిగాయి. ఎడతెరిపిలేని వర్షంతో ఇల్లులు దెబ్బతినడంతో గిరిజనులు లబోదిబోమంటున్నారు. కించమండ వారపుసంత జనాలు లేక బోసిపోయింది..

చింతపల్లి: తుఫాను ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో వాగులు, పొలాలు ఏకమై నీటితో నిండిపోయాయి. అప్రమత్తమైన అధికార యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినప్పటికీ మన్య ప్రాంతంలోనూ తుఫాను ప్రభావంతో తీవ్ర నష్టం వాటిల్లింది. అనేక పూరిళు దెబ్బతిన్నాయి. పంట పొలాలలో వరిపనులను కుప్పలు కొట్టుకుపోయాయి. ఈదురు గాలులకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, వక్షాలు నేలకొరిగాయి. పలు ఇళ్ల గోడలు కూలడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జనజీవనం స్తంభించింది.

హుకుంపేట: తుఫాను ప్రభావంతో గన్నేరు పుట్టు, మేరకచేంత, తాడేపుట్టు. కొట్నా పల్లి అండిభ తదితర పంచాయతీలో వరిపంటలకు తీవ్ర నష్టం జరిగింది. దుర్గం గ్రామ పంచాయతీ పాతుని కన్నపాత్రుడు అనే రైతు ఇల్లు వర్షం కారణంగా సగం కూలీ పడిపోయింది.హుకుంపేట చిడి పుట్టు ఒంటిపాక వంతెనలు, కల్వర్టుకు నష్టం వాటిల్లింది. తుపాను బాధితులకు ప్రభుత్వం వెంటనే నష్టపోయిన రైతులకు ప్రభుత్వ సహాయం ప్రకటించాలని గిరిజన సంఘం, సిపిఎం నేత టి కృష్ణారావు, రామారావు, కొండలరావు డిమాండ్ చేస్తున్నారు.



హుకుంపేటలో గోడ కూలిన పెంకుటిల్లు

తప్పిన పెను ప్రమాదం

కెకె.లైన్ విద్యుత్ తీగలపై చెట్టుపడి ఎగసిపడ్డ మంటలు



గూడ్స్ రైలుపై చెలరేగుతున్న మంటలు

అనంతగిరి : మిచౌంగ్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో కెకె.లైన్‌లో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మంగళవారం రన్నింగ్‌లో ఉన్న గూడ్స్‌రైలు ఇంజిన్‌పై కొండచరియలు,బండరాళ్లు విరిగిపడడంతో ఇంజిన్ పట్టాలు తప్పి పైలెట్ అప్రమత్తతతో పెను ప్రమాదమే తప్పగా, బుధవారం కూడా అలాంటి ఘటనే చోటుచేసుకుంది. శివలింగపురం టైడా మార్గమధ్యలో గూడ్స్ రైలు వెళుతుండగా, హఠాత్తుగా భారీ చెట్టు విరిగిపడి, ఒఎఫ్‌సి విద్యుత్ తీగలపై పడడడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి బుధవారం సాయంత్రం కిరండోల్ నుంచి విశాఖకు ఐరన్‌లోడ్‌తో వెళ తున్న గూడ్స్ రైలుకు టైడా రైల్వేస్టేషన్ సమీపంలోఈ ప్రమాదం జరిగింది. ఇక్కడ కూడా పైలెట్ అప్రమత్తతతో గూడ్స్ నిలిపేయడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని అంటున్నారు. మంటలను అదుపులోకి తెచ్చిన తర్వాతగూడ్స్‌పై విరిగిపడ్డ చెట్టును తొలగించి, లైన్‌ను పునరుద్ధరించిన తర్వాత రైళ్ల రాకపోకలు సజావుగా సాగేందుక సంబంధిత రైల్వే శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

లువ్వ గెడ్డలో ముగ్గురు గిరిజనులు గల్లంతు

పొద్దుపోవడంతో సహాయక చర్యలకు అంతరాయం



ప్రమాదానికి కారణమైన లువ్వ గెడ్డ

ప్రజాశక్తి -అనంతగిరి : మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో ఉధృతంగా ప్రవహిస్తున్న లువ్వగెడ్డలో ముగ్గురు గిరిజనులు గల్లంతయ్యారు. వివరాలివి. మండలంలోని నాన్‌షెడ్యూల్ భీంపోలు పంచాయతీ సీతపాడు గ్రామానికి చెందిన గెమ్మెలి లక్ష్మి (52), మిరియాల, కమల (40), గెమ్మెలి కుమార్ (25) అనే ముగ్గురు గిరిజనులు తాటిపూడి జలశయానికి నీరు ప్రవహించే లువ్వగెడ్డ దాటుతూ బుధవారం నాలుగు గంటల సమయంలో గల్లంతయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు. సీతపాడుకు చెందిన యువకుడు, ఇద్దరు మహిళలు బుధవారం కాశీపట్నం సంతకు వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వస్తుండగా, మార్గమధ్యలో ఉన్న లువ్వ గెడ్డను దాటే క్రమంలో ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయారు. సంతకు వెళ్లి వస్తున్నతోటి గిరిజనుల చూస్తుండగానే వీరంతా నీటిలో కొట్టుకుపోయినా, ఏ ఒక్కరూ రక్షించే సాహసం చేయలేకపోయారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీస్ రెవెన్యూ యంత్రంగానికి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నప్పటికీ చీకటి పడటంతో గాలింపు చర్యలకు ఆస్కారం లేకుండా పోయింది. అధికారులు ముందస్తు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ గత్యంతరం లేని పరిస్థితుల్లో గెడ్డలను దాటే క్రమంలో ఇలా ప్రమాదానికి గురికావడంపై ఆందోళన వ్యక్తమౌతోంది. గల్లంతైన వ్యక్తుల కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సంఘటనాస్థలికి పెద్దఎత్తున గిరిజనులు చేరుకున్నారు. ఏజెన్సీలో వర్షాలు కురిసే ప్రతి సందర్భంలోనూ ఇటువంటి ప్రమాదాలు సర్వసాదారంగా మారాయి. అధికారులు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ,నిత్యం అదే మార్గాల్లో రాకపోకలు సాగించే మన్యవాసులు తమకేమౌతుందిలే అనే అజాగ్రత్తతో ఇలా ప్రాణాలు కోల్పోతున్నారు

తుపాన్‌కు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మునిగిన పంటలను పరిశీలించిన సిపిఎం నాయకులు

నీటి మునిగిన పొగాకు పంటను పరిశీలిస్తున్న నాయకులు



ప్రజాశక్తి-ఎటపాక

మీచౌంగ్ తుఫాన్ వలన రైతులు తీవ్రంగా నష్టపోయారని, పత్తి, వరి, మిర్చి పంటలు నీట మునిగి నాశనమయ్యాయని, బాధిత రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఐవి డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం మండల నాయకులు మండలంలోని తుఫాను వలన జరిగిన నష్టాన్ని పరిశీలించిన రైతులను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, పంట నష్ట పరిహారం కోసం సిపిఎం ఆధ్వర్యాన పోరాడదామని భరోసా ఇచ్చారు. వరి ఎకరాకు రూ.40 వేలు, పత్తికి ఎకరాకు రూ.70వేలు, మిర్చికి ఎకరాకు రూ.2 లక్షలు పెట్టుబడి అయిందని, ఆ మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.హుస్సేన్, బుద్దుల భద్రయ్య, సీసం అర్జున్, భీష్మారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని పలు గ్రామాల్లోని తూఫాన్ ధాటికి మినుము, జొన్న, పెసలు, మొక్కజొన్న, మిర్చి, పొగాకు పూర్తిస్థాయిలో నష్టం జరిగిందని రైతు సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తూఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలను బుధవారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో మండల నాయకుడు తలగాని నాగరాజు, ఆవుల మురళి, గడ్డిపాటి షణ్ముఖరావు, నోముల సత్యనారాయణ, సిపిఎం నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, ఈశ్వర్లు, నాగమణి, భారతి, ఎడ్ల వెంకన్న బాబు, నీలా ఏడుకొండలు, జక్కుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలో భారీ తుఫాను కారణంగా నష్టపోయిన పంటలను సిపిఎం బృందం పరిశీలించింది. అపరాలు, మినుము, జొన్న, పెసలు, మొక్కజొన్న, మిర్చి, పొగాకు పంటలు పూర్తిస్థాయిలో నష్టపోయినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పూనం సత్యనారాయణ, పంకు సత్తిబాబు, సోడి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం దేవరపల్లి పంచాయతీ పరిధి తుఫాన్‌కు దెబ్బతిన్న పంటను సిపిఎం నాయకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు గడుతురి సత్యనారాయణ మాట్లాడుతూ అకాల వర్షాలకు వరి పంటలు నేల ఒరిగి నీటిపాలైందని, కొన్నిచోట్ల వరి కుప్పలు పూర్తిగా తడిసిపోయాయని, పంట ఎందుకు పనికి రాకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మినప, రాజ్‌మా పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కొయ్యూరు : మండలంలోని ముంపునకు గురైన పంటలను సిపిఎం జిల్లా నాయకులు ఎస్ సూరిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాఫ్ నమోదు నిబంధనను సడలించి నష్టపోయిన రైతులను గుర్తించి ప్రతి రైతునూ ఆదుకోవాలని కోరారు.

అరకులోయ రూరల్: మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు ఇంటి వెనుకగోడ కూలిపోయిన ఎండపల్లివలస గ్రామ నివాసి కిల్లో మహేష్‌కు పరిహారమిచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర, సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయితీ ఎండపల్లివలస గ్రామం సందర్శించి, కూలిన ఇంటిని పరిశీలించారు. బాధితుడు మహేష్‌ను పరామర్శించారు. బాధిత కుటుంబానికి తక్షణసాయంగా 50 కిలోల బియ్యం, కందిపప్పు, ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, ఇంటికి నష్టపరిహారంగా రూ.లక్ష అందజేసి, తర్వాత శాశ్వత ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని వరి, సామలు, చోడి, రాజ్మా, కాఫీ, ఇతర పంటనష్టాలపై సమగ్రంగా సర్వే చేసి బాధిత రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అరకులోయ రూరల్: తుఫాన్ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు డిమాండ్ చేశారు.బుధవారం మండలంలోని బస్కి పంచాయితీ జాకరవలస గ్రామంలో పర్యటించారు తుపానుతో నష్టపోయిన వరి,కందులు, వలిసెలు, ఇతర పంటలను పరిశీలించారు.పర్యటనలో కె సత్తిబాబు, పి ధన, పి ప్రహ్లాద్, కె.నందో, కె ధనుంజయ్, కె గౌరమ్మ, జి డాలిమ్మ, డొంబు, హరి, పాల్గొన్నారు.



నీట మునిగిన పంటను చూపుతున్న సిపిఎం మండల కార్యదర్శి రామారావు



కొండచరియలు తొలగింపు పనుల్లో సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు, సర్పంచ్

సహాయక చర్యల్లో సిపిఎం నేతలు

అనంతగిరి : అనంతగిరి, అరకు ఘాట్ రోడ్డు పలుచోట్ల కొండ చరియలు విరిగిపడ్డాయి.సమాచారం తెలుసుకున్న జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, టోకూరు సర్పంచ్ కె .మొస్య, ఎంపిడిఒ హర్షిత్ రాజ్యం ఎస్ఐ కె.రాము సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు ఆ శాఖల సిబ్బంది ఘటన స్థలంలో చేరుకుని, జెసిబిల సహాయంతో విరిగిపడిన కొండచరియలు, మట్టిదిబ్బలను స్థానిక ప్రజల సాయంతో వర్షాలకు సైతం లెక్కచేయకుండా తొలగించే పనులు చేపట్టారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఘాట్‌రోడ్డులో ప్రయాణమంటేనే ప్రజలు, వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.


నీటి ముంపునకు గురైన వరిపైర్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జెడ్‌పి చైర్‌పర్సన్

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం

ముంపునష్టాలను పరిశీలించిన పాడేరు ఎమ్మెల్యే, జెడ్‌పి చైర్‌పర్సన్

ప్రజాశక్తి - పాడేరు: మిచౌంగ్ తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుని అందరికీ అండగా నిలుస్తుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నదాతలకు భరోసానిచ్చారు. బుధవారం పాడేరు మండలం వంతాడపల్లి పంచాయతీ పరిధిలో మునిగిన మిరప, రాగులు, రాజ్ మా, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల కారణంగా తడిసి నష్టపోయిన పంటలకు సంబంధించిన వివరాలన్నీ సేకరించి , ఒక వరి మాత్రమే కాకుండా సర్వే రూపంలో ఇచ్చిన రాజ్ మా, మిరప, రాగులు ఇతర పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునే చర్యలు చేపడతామన్నారు. ప్రాణనష్టం జరగకుండా ఎప్పటికప్పుడు ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకుంటున్నారు. వర్షాల వల్ల నీట మునిగి నష్టపోయిన పంటల వివరాలను ప్రభుత్వం సేకరిస్తుందని, దీనిపై కలెక్టర్ సుమిత్ కుమార్, ఉపముఖ్యమంత్రి రాజన్న దొరతో చర్చించారని ఈ క్రాపింగ్ చేసుకున్న ప్రతి రైతుకూ పరిహారం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సరస్వతి, డైరెక్టర్ కన్నాపాత్రుడు, పాల్గొన్నారు.


తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న డాక్టర్ వెంకటలక్ష్మి

బాధిత రైతులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి - జి.మాడుగుల : మిచౌంగ్ తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని వైసిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు, జి.మాడుగుల జెడ్‌పిటిసి డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను, పంట పొలాలను,కుమ్మిడిసింగి పంచాయతీ సంపలం బ్రిడ్జిను గెడ్డరాయి బ్రిడ్జిని పరిశీలించారు. గెడ్డరాయి బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తున్నందుని సుమారు 12 గ్రామాల గిరిజనులకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జి.మాడుగుల పంచాయతీ చట్టిపెట్ట కాలనీలో వర్షాల కారణంగా దెబ్బతిన్న కిల్లో మహేష్ ఇంటిని, పరిశీలించి శాశ్వత గృహ నిర్మాణానికి ప్రభుత్వ సాయం అందిస్తుందని భరోసానిచ్చారు. వరి, రాగులు, మిరప రాజ్మా వంటి పంటలు నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో కే.కోటపాడు మాజీ ఎంపీటీసీ సత్యనాయుడు, వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు సత్యనారాయణ, బాలన్న, వలసయ్య నరసింహమూర్తి పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘననివాళి

ప్రజాశక్తి పాడేరు: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పి.సింహాద్రి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.చిన్నారావు మాట్లాడుతూ అంబేద్కర్ జీవిత చరిత్రను తెలుసుకుని, ఆయన ఆశయసాధనకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం, హక్కులు, చట్టాలపై విస్తృతం చర్చలు జరపాలన్నారు కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి. సింహాద్రి, కార్తీక్, పి.రాంబాబ,వరహాలు, మత్స్యరాజు పాల్గొన్నారు.

పెదబయలు :మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు సిహెచ్ భీమసుందరరావు ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు ఘనమైన నివాళులర్పించారు ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు మర్రిచెట్టు అప్పారావు జ్యోతి ప్రజ్వళన చేసి, అనంతరం బాబాసాహెబ్ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జె రవిబాబు, పంచాయతీ కార్యదర్శి పలసి తిరుపతిరావు టీచర్ ఎస్ మత్స్యలింగం, పలాసి కొండబాబు, కూడా జానకిరాం, గణపతి మాస్టారు ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

జి.మాడుగుల : మండలంలో బొయితిలి పంచాయతీ మద్దిగరువు గ్రామంలో మూడు రోడ్ల జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి స్థానిక సర్పంచ్ మాలన్న పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.


సీలేరులో...


పాడేరులో నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ టి.రత్నం టి.దయానిధి కె.బుజ్జిబాబు, వై.సూరిబాబు బి, ఈర్మాయరాజు పాల్గొన్నారు

చింతూరు : భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 77వ వర్ధంతిని మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పలు సంఘాల నాయకులు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అరవిందు కుమార్, జీవన్ కుమార్. ఆనంద్ రాజు, దేవర ప్రసాద్, వేణు, గుండెపోగు శ్రీను, రజిని, కంటెం రమేష్ పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పోస్ట్ ఆఫీస్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఏపీ జెన్కో ఎస్సీ సివిల్ కేకేవి.ప్రశాంత్ కుమార్, ఈఈ లక్ష్మీనారాయణ, ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో క్యాంప్ ఏఈ సురేష్, ఎస్సీ అసోసియేషన్ నాయకులు నాగరాజు సత్తిబాబు శ్రీధర్, ఇంజనీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మారేడుమిల్లిలోని బోదులూరు రోడ్లో గల అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎంపీటీసీ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబి) మండల యువత ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బత్తుల ప్రతాప్ సింగ్ గడుతుర్ కిషోర్ కుమార్ సాధన నారాయణరెడ్డి పెంట సూర్యం తదితరులు పాల్గొన్నారు.

నీటి ముంపు తొలగింపునకు చర్యలు

9 నుంచి తుపాను నష్టాలపై గణన : జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



ప్రజాశక్తి -పాడేరు : పంట పొలాలల్లో నిలిచిపోయి ఉన్న నీటిని యుద్ధప్రాతిపదికన తొలగింపు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఈనెల 9వ తేదీ నుండి తుఫాను నష్టాలపై ఎన్యూమరేషన్ చేపట్టాలన్నారు. జిల్లాలో పంట నష్టాలపై రైతులు ఆందోళన చెందవద్దని పంట నష్టాలపై ప్రభుత్వానికి నివేధించి నష్ట పరిహారం అందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసారు. బుధవారం కలెక్టరేట్ చాంబరు నుండి వ్యవసాయాధికారులు, ఉద్యానవన అధికారులు, ఎంపిడిఒలు, తాహశీల్దారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో జరిగిన తుఫాను నష్టాలపై కచ్చితమైన నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, రోడ్డులు దెబ్బతింటే వెంటనే పునరుద్దరణ పనులు చేయాలని సూచించారు. పునరుద్దరణ పనులు చేయకపోతే ప్రమాదాలు, నష్టాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. రవాణాకు ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని సూచించారు. ఎంపిడిఒలు, తాహశీల్దారులు సచివాలయం సిబ్బంది సమన్వయంతో పనులు చేయాలన్నారు. ఇళ్లు, వ్యవసాయ, ఉద్యాన పంటలు, పశువుల నష్టంపై నివేదికలు సమర్పించాలని సూచించారు.

మోటరు పంపులను అద్దెకు తీసుకుని పంటపొలాల్లోని నీటి నిల్వలు తొలగింపు చర్యలు చేపట్టాలని, అవసరమైన నిధులు విడుదల చేస్తామన్నారు జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్. నంద్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 600 హెక్టార్ల వరకు వరి, 250 హెక్టార్ల పత్తి, ఇంకా రాజ్మా, ఇతరపంటలు నష్టం జరిగిందని ప్రాధమికంగా అంచనా వేశామన్నారు. జిల్లా ఉద్యానవన అధికారి ఎ. రమేష్ కుమార్ రావు మాట్లాడుతూ డుంబ్రిగుడ, అరకు, అనంతగిరి మండలాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారని వర్షాలు తగ్గిన తరువాత నష్టాలను పరిశీలించి, అంచనా నివేదికలు తయారు చేస్తామన్నారు. చింతూరు డివిజన్లో 50 ఎకరాల వరకు మిర్చి పంట దెబ్బతిందన్నారు. టెలీ కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడి ఏ పి ఓ లు వి. అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య పాల్గొన్నారు.


ధనసానివలసలో పర్యటిస్తున్న పిఒ అభిషేక్

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పిఒ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలో లోతేరు, చినలబుడు పంచాయతీల్లో పాడేరు ఐటిడిఏ పిఒ వి అభిషేక్, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పర్యటించి పంట పోలాలను,వంతెనలు పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటోందని రైతులకు భరోసా ఇచ్చారు. పంచాయతీలోని పెదగెడ్డ వలస గ్రామంలో ఉన్న ఆరు కుటుంబాలను ధనసానివలస గ్రామంలో ఉన్న పాఠశాలకు తరలించి పునరాసం ఏర్పాటు చేసారు .పునరావాస కేంద్రంలో ఉన్న గిరిజనులకు తాగునీరు, భోజన సదుపాయాలు సమకూర్చారు. పెదగెడ్డ వలస గ్రామం సమీపంలో ఉన్న కొండ ఉందని ముందు జాగ్రత్త చర్యగా ఆ గ్రామంలో ఉన్న గిరిజనులను తరలించారు. పూర్తిగా తుఫాను అదుపులోకి వచ్చిన తరువాత ఇళ్లకు పంపిస్తామని పిఒ అన్నారు. ౧. ఇళ్లకు వెళ్లేటప్పుడు ప్రతీ కుటుంబానికి 25 కేజీల బియ్యం అందిస్తామన్నారు. లోతేరు గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పదోవ తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించారు. సోషల్ పాఠ్యాంశాలు బోధించారు.పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యార్థులకు రాగి జావను పంపిణీ చేసారు. నాణ్యమైన భోజన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాడేరు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు,అరకు తాహశీల్దార్ వేణుగోపాల్, పంచాయితి సెక్రెటరీ గోపీనాథ్, నొబో , శ్రీరాములు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

- జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : మిఛాంగ్ తుఫాన్ ప్రభావంతో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టకపోవటంతో పాటు మరో రెండు, మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని ఈనెల 7న గురువారం అన్ని యాజమాన్యాలలో నిర్వహిస్తున్న విధ్యా సంస్థలకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్థానిక సెలవు ప్రకటించారు.

ఆదివాసీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి పాడేరు: మిఛాంగ్ తుఫాను ప్రభావంతో వరి, రాజుమా, పత్తి తదితర పంటల నష్టపోయిన ఆదివాసులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. పంట నష్టం పరిశీలనకు పాడేరు మండలం సన్యాసం పాలెం, చింతల వీధి, కిండంగి, తలచింది ముల్లుమట్ట తదితర గ్రామాలలో గిరిజన సమాఖ్య బృందం పర్యటించిందన్నారు. తుపానుతో సంభవించిన పంట నష్టాన్ని గుర్తించి, రైతులందరికీ తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో లోచలి నాయుడు, పూటి రాజు, కాసులమ్మ, బి శివ ప్రసాద్, కొండబాబు పాల్గొన్నారు.

సిహెచ్‌డబ్ల్యుల ఐటిడిఎ ముట్టడి వాయిదా

ప్రజాశక్తి -పాడేరు: కమ్యూనిటి హెల్త్‌వర్కర్స్ సమస్యలపై ఈ నెల 8న శుక్రవారం తలపెట్టిన ఐటిడిఎ ముట్టడి ఆందోళన తుపాన్ కారణంగా వాయిదా వేస్తున్నామని సిఐటియు జిల్లా అధ్యక్షులు బి చిన్నయ్య పడాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక ఆరోగ్య కార్యకర్తలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. తదుపరి ఆందోళన కార్యాచరణ తేదీలను తెలియజేస్తామని వెల్లడించారు.


దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

వరి పొలాలను పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-రంపచోడవరం : వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ బుధవారం పరిశీలించారు. రంపచోడవరం మండలం రంప గ్రామంలోని వరి ధాన్యం సాగు చేసిన రైతు పొలాలను ఆయన పరిశీలించి ఎన్ని ఎకరాలు వరి పంట వేసింది, ఎన్నికరాలలో ధాన్యాన్నిము కోత కోసింది, ఇంకా ఎన్ని ఎకరాలు వరి కోత కోయవలసి ఉన్నది, తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ తుఫాను వల్ల వరి సాగు చేసిన రైతులకు ఏమైనా నష్టం వాటిల్లింది, లేనిది ఆరా తీశారు.

అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీల వినతి

ప్రజాశక్తి-అడ్డతీగల : మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి సిఐటియు డివిజన్ నాయకురాలు బి.నిర్మల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్ డ్యూటీ ఇవ్వాలని, 26000 జీతాలు పెంచాలని, వారి న్యాయమైన కోరికలు వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 8 నుంచి తలపెట్టిన అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో బుధవారం సాయంత్రం నగరంలోని ఎల్ఐసి కార్యాలయం దరి అంబేద్కర్ విగ్రహానికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు వై.తులసి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదన్నారు. తెలంగాణ కన్నా అదనంగా రూ.1000 వేతనం ఇస్తామన్న మాట నీటిమూటగానే మిగిలిందన్నారు. సుప్రీంకోర్టు అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేయాలని తీర్పునిచ్చినా బేఖాతరు చేయడం దారుణమన్నారు. లబ్ధిదారులకు నాసిరకమైన సరుకులు సరఫరా చేయడం, అనవసరమైన యాప్ వర్క్‌లు రుద్దడం, నెట్ సౌకర్యం లేకపోవడం, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చకపోవడం, అద్దె బకాయిలు, టిఎ, డిఎలు చెల్లించకపోవడం, రిటైర్‌మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచకపోవడం శోచనీయమన్నారు. ఆయాల నియామకాల్లో రాజకీయ జోక్యం అరికట్టకపోవడం మొదలైన అంశాలపై పలుమార్లు చేసిన విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఈ నెల 8 నుంచి సమ్మెకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షురాలు పి.మణి, నాయకులు నజ్మా, పార్వతి, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెకు
సిఐటియు సంపూర్ణ మద్దతు

ఐసిడిఎస్ రక్షణ కోసం, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8 నుంచి జరుగుతున్న నిరవధిక సమ్మెకు సిఐటియు విశాఖ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతునిస్తోందని ఆ సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై రోజు రోజుకూ పనిభారం పెంచుతోందన్నారు.

కొనసాగుతున్న 'ఉక్కు' దీక్షలు


జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షల్లో కూర్చున్న నాయకులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోనూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్దా తలపెట్టిన దీక్షలు ఉద్యమ స్ఫూర్తితో సాగుతున్నాయి. ఓ వైపు తుపాను భయపెడుతున్నా వెరవకుండా కార్మికులు, ప్రజలు ఈ దీక్షా శిబిరాలకు తరలివచ్చారు.

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని ఐఎన్‌టియుసి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు బుధవారానికి 979వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి అనుబంధ పోర్టు ట్రస్ట్ నేషనల్ ఎంప్లాయీస్ యూనియన్ ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను మోడీ ప్రభుత్వం స్థాపించలేదని, అటువంటప్పుడు దాన్ని అమ్మే అధికారం ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థల వల్లనే దేశం ప్రగతి మార్గంలో నడుస్తోందని తెలిపారు. విశాఖపట్నం, ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కార్మిక, ప్రజా సంఘాల ఐక్యతతో అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. దీక్షల్లో జి.చందు, గురు ప్రసాద్, వెంకటరావు, సత్యనారాయణ, మంజుల, శాంతి, అప్పారావు, శ్రీను పాల్గొన్నారు.

ఉక్కునగరం : కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన దీక్షలు బుధవారానికి 1028వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఫ్ఎండి, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సిఎంఇ, విఎస్‌జిహెచ్, ప్లాంట్ డిజైన్ విభాగాల ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, కారు రమణ, రామకృష్ణ, దాసరి శ్రీనివాస్, సిహెచ్.సన్యాసిరావు మాట్లాడారు. తొలుత దీక్షా శిబిరంలోనే అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆ మహనీయుని స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు పోరాటం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, గుమ్మడి నరేంద్ర, ఇ.శ్రీనివాసరావు, వరసాల బాలకృష్ణ, గంగవరం గోపి, జిఆర్‌కె.రాజు, వెంకటరావు పాల్గొన్నారు.


కూర్మన్నపాలెం కూడలిలో దీక్షల్లో కూర్చున్న ఉక్కు కార్మికులు

యువగళం ముగింపు సభ స్థల పరిశీలన

ప్రజాశక్తి పిఎం.పాలెం : టిడిపి యువగళం ముగింపు సభకు సంబంధించిన స్థలాన్ని ఆ పార్టీ నేతలు పరిశీలించారు. ఈ మేరకు బుధవారం మారికవలసలోని ఓజోన్ వ్యాలీ రోడ్డులో స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సమాలోచనలు చేశారు. అక్కడకు వచ్చిన ఏర్పాట్లు గురించి సమీక్ష జరిపిన వారిలో మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ మూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవి, పార్టీ భీమిలి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, పాసర్ల ప్రసాద్ ఉన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన యువగళం పాదయాత్రను ఈ నెల 17న విశాఖలోని భీమిలి నియోజకవర్గంలో ముగించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా వస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బహిరంగ సభలో చంద్రబాబు నాయుడుతో సహా రాష్ట్రంలోని ప్రముఖులంతా పాల్గొనున్నారు.

నేడు జనసేనలోకి సుందరపు వెంకట సతీష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ రియల్టర్ సుందరపు వెంకట సతీష్ కుమార్ గురువారం మధ్యాహ్నం 3:30 గంటలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరనున్నారని ఆ పార్టీ నాయకులు పంచకర్ల రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఎఎస్.రాజా మైదానంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు పవన్ కల్యాణ్ విశాఖ చేరుకుంటారని, మొదటగా నోవటల్‌కు వెళ్లి మధ్యాహ్నం 3:30 గంటలకు ఎంవిపి.కాలనీలోని ఎఎస్ రాజా మైదానానికి చేరుకుంటారన్నారు. అనంతరం అక్కడ జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ సోదరుడు సుందరపు వెంకట సతీష్ కుమార్ అతని అనుచరులతో జనసేనలో చేరనున్నారని తెలిపారు. అనంతరం జరిగే బహిరంగ సభలో పవన్ ప్రసంగిస్తారని తెలిపారు. తెలంగాణా ఎన్నికల అనంతర పరిణామాలు, మిచౌంగ్ తుపాను ప్రభావంతో రైతుల కష్టాలు గురించి ఆయన మాట్లాడే అవకాశం ఉందన్నారు. సభ అనంతరం స్థానిక నాయకులతో పవన్ ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న పిఒ సూరజ్ గనోరే

గ్రూప్స్, సివిల్స్ ఉచిత శిక్షణకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన యువతి యువకులు సివిల్ సర్వీసెస్, గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగాల శిక్షణ కొరకు రెండవ లెవెల్ పరీక్షలో ఉత్తీర్ణత అయిన 120 మందిలో మొదటి రోజు 38 మందికి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే బుధవారం తన చాంబర్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం మండలాలకు చెందిన వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ అర్హత సాధించిన యువతీ యువకులకు నిబంధనల ప్రకారం ఈనెల 15వ తారీకు నుండి రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్లో అనుభవజ్ఞులతో తొమ్మిది నెలలపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు మొత్తం మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఏపీవో జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, ట్రైనింగ్ డిటి డబ్ల్యూ ఓ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : జనసేన

కొయ్యూరు : మిచౌంగ్ తుఫాను కారణంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోయారని. వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం ఉదారత చూపాలని జనసేన అరకు పార్లమెంట్ ఇంచార్జ్ వంపూరు గంగులయ్య కోరారు. నష్టపోయిన రైతుల వివరాల సేకరణలోనూ పరిహారం అందజేయడంలోనూ పారదర్శకత పాటించాలని సూచించారు. ఈ క్రాఫ్ నమోదు నిబంధనను సడలించి వాస్తవంగా నష్టపోయిన వారిని గుర్తించి ప్రతి రైతునూ ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు మండల జనసేన నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారి పరిశీలన

కొయ్యూరు : తుపాన్ వల్ల దెబ్బతిన్న పంట పొలాలను మండల వ్యసాయాధికారిని ఉమాదేవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షాలకు మండలంలో 3 రోజుల నుంచి 220మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. సుమారు 35 గ్రామాల్లో పంట నష్టం దాదాపు 202 హెక్టార్లలో ఉన్నట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. కోసిన పనల మీద ఉన్న పనాలను గట్ల మీద వేసి పంటలను కాపాడాలని సూచించారు. గింజలు మొలకత్తకుండా ఉండడం కోసం ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని వర్షం తగ్గిన తర్వాత పిచికారి చేయాలని సూచించారు.

విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరిస్తున్నాం

- ఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తుపాను నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఎక్కడ ఆగినా వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నట్టు ఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్ తెలిపారు. ఇంధన శాఖ కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎక్కువ నష్టం సంభవించిన నెల్లూరు జిల్లాకు సహకరించేందుకు మంగళవారం తరలి వెళ్లిన ఆయన గూడూరు తదితర ప్రాంతాల్లోని సిబ్బందితో సమీక్షలు నిర్వహించారు. తిప్పగుంటపాలెం, చెందోడు, కోట, వెనుగుంటపాలెం, మామిడికాలువ తదితర ప్రాంతాల్లో బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని పరిశీలించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సలహాలిచ్చామన్నారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో ప్రధానంగా నష్టం ఏర్పడిన రాజమండ్రి, ఏలూరు, విజయనగరం సర్కిళ్లలో ఐదు పట్టణాలకు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించి మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు 395 ప్రత్యేక బృందాలతో సంస్థ సిబ్బంది రేయింబవళ్ళు కష్టపడి పని చేస్తున్నారని వెల్లడించారు.